# వింతకోరిక

'నాకేమైనా ఉత్తరాలు వచ్చాయా?' ఆఫీసు నుంచిరాగానే రోజూ అడిగినట్టే, ఆ రోజు కూడా ఆ ప్రశ్నవేశాడు ప్రమోద్.

'ఊ...' చెప్పింది... కార్తిమాల.

"ఎక్కడనించి?"

"ఎక్కడనుంచంటే..."

"ఏది?" ఆత్రంగా అడిగాడు.

"మీ టేబిల్ మీద పెట్టాను"

చెప్పులు విడిచి, బెడ్‌రూంలోకి నడిచాడు. అక్కడ టేబిల్ మీద గులాబీరంగు కవరొకటి ఉండటంతో దాన్ని అందుకుని చూసాడు. దానిమీద రాసున్నది చూసి గతుక్కుమన్నాడు!

"టు..., మీకు... ఫ్రమ్..., నేను"

అది పోస్ట్‌లో వచ్చిన ఉత్తరం కాదని అతనికి అర్థమైంది. దస్తూరిని బట్టి తెలుసుకోగలిగాడు, అది ఎవరు రాసారో. అది కార్తిమాల దస్తూరని గుర్తించాడు.

నిజానికి ఆ రోజు పోస్ట్‌లో అతనికేం ఉత్తరాలు రాలేదు. కార్తిమాలే ఆ కవరు అక్కడుంచింది.

ఏం రాసింది?

అంటించి ఉన్న ఆ కవరు విప్పి చూసాడు.

లోపల ఏం రాసిలేదు. ఒక ఆకుపచ్చరంగు కాగితం తప్ప.

కొద్దిక్షణాలపాటు అతనికేం అర్థంకాలేదు. అర్థమైన తరువాత అతని ఆనందానికి అవధుల్లేవు. గట్టిగా అరిచాడు. సంతోషం పట్టలేక... 'యా'.

ఎప్పుడొచ్చి నిలబడిందో గుమ్మం దగ్గర నిలబడి ఉంది కార్తిమాల.

ఆమెవైపు చూసి అడిగాడు.

"ఒప్పుకున్నట్టేనా?"

"ఊ..." బుర్రదించుకుని చెప్పింది

"థాంక్యూ" ఆమె దగ్గరగా నడిచి అన్నాడు.

"కానీ కొన్ని షరతులకి కూడా మీరు ఒప్పుకోవాలి"

"ఏంటి?"

"ఈ రోజు ఒక్కరోజే"

"అలాగే"

"ఈ రోజు ఏ కారణం చేతనైనా ఫెయిల్ అయినా, మీరింకెప్పుడూ దాని గురించి ప్రెస్ చెయ్యకూడదు."

"అలాగే"

"ఇంకా"

"నువ్వెన్ని షరతులు పెట్టినా, ఓ.కె. నువ్వింకేం చెప్పనక్కరలేదు. నా కోరిక కాదనలేదు. అందుకు చాలు" ఆమెకి మరింత దగ్గరవుతూ అన్నాడు.

అప్పట్నుంచి, కార్తిమాల ఆ రోజురాత్రి బెడ్‌రూంలో అడుగుపెట్టేవరకూ క్షణమొక యుగమైంది ప్రమోద్‌కి.

కార్తిమాల రాత్రి తొమ్మిదవుతుండగా పనులన్నీ ముగించుకుని ఆ గదిలోకి వచ్చి ప్రమోద్ పడుకున్న బెడ్‌వైపు నడిచింది.

గదిలోకి వస్తూ లైటార్పింది. ఆ గదంతా చీకటి ఆవరించుకుంది.

ప్రమోద్ బిత్తరపోయాడు! కొద్దిక్షణాల తరువాత అడిగాడు ప్రమోద్.

"ఒప్పుకున్నానన్నావు"

"ఇప్పుడుకూడా చెబుతున్నాను. అందుకు ఒప్పుకున్నాను"

"మరి లైటెందుకు ఆర్పేసావు?"

"కొన్ని షరతులున్నాయని అన్నావుగా"

"అందులో ఇదొకటా?"

"ఊ..."

"ఇంతకీ ఎప్పుడు?"

"ఎందుకంత తొందర?"

"ఆత్రం నీకు లేదా?"

"ఉండకపోతే ఇక్కడికెందుకొస్తాను... అన్నట్టు మన పెళ్ళయి ఎన్నాళ్ళు కావస్తోంది?"

"ఆరు నెలలు"

"ఆరు నెలలుగా లేని ఆలోచన ఇప్పుడెందుకొచ్చింది ప్రమోద్"

"చాలా కాలంగానే అడగాలనుకుంటున్నాను... కానీ నా వైపు వింత జంతువును చూసినట్టు చూస్తావని భయమేసింది."

"ఇంతకీ నీ కోరిక బెడ్ రూంలో లైటుంచాలి... అంతే కదా?"

"అవును... భార్యామణి"

"నిజానికి నాకందుకిష్టం లేదండి... ఎందుకో తెలుసా..."

"చెప్పు"

"నా అభిప్రాయం ఏమిటంటే, బెడ్‌రూం పైనున్నవారికి బెడ్‌రూంలోంచి అరుపులు, గట్టిగా మాటలు వినిపించకూడదండి... గుసగుసలే వినిపించి గిలిగింతలు పెట్టాలి. అలాగే చీకటిలో జరగాల్సిన పనుల్ని బట్టబయలు చేసుకుంటే అందులో ఆనందం ఉండదు."

"మరియితే పెద్ద గొప్పగా ముందు ఎందుకు ఒప్పుకున్నావు"

"ఇప్పుడైనా ఒప్పుకుంటున్నాను."

"అయితే లైట్ వేసెయ్యనా?"

"వద్దు... ఓ పది నిముషాల తరువాత బెడ్ ప్రక్కనున్న రెగ్యులేటర్ లేంప్ ఆన్ చెయ్యండి... నాకు సిగ్గుగా ఉంది..." అతని గుండెల మీద తల ఆన్చి అంది.

అప్పుడు చూసాడు. బెడ్ ప్రక్కనున్న రెగ్యులేటింగ్ లేంప్‌ని. ఎప్పుడూ ఉపయోగించరు. ఆ రోజు అది బెడ్ ప్రక్కనుండే సరికి కార్తిమాల దాన్ని అక్కడ ఎందుకు పెట్టిందో అర్థమైంది. కొంతసేపైన తరువాత బెడ్ మీదనుంచి లేవకుండానే లైట్ వెయ్యచ్చు.

'ఓ.కె. అన్నాడు. ఆమెని దగ్గరగా లాక్కుంటూ ఆనందంగా.

మరో పదినిముషాల్లో ఆమె అతని చేతుల్లో వివస్త్ర అయింది. అందుకామె అభ్యంతరం చెప్పలేదు.

ప్రమోద్ ఆమెని కుడిచేత్తో పొదివిపట్టుకుని ఎడంచేతిని లేంప్ వైపు పోనిచ్చాడు.

## తిరుమల పెద్దింటి వరదరాజు

అది గమనించి కొర్తిమాల తనపైకి బ్లాంకెట్ లాక్కుంది. ప్రమోద్ ఏం అనలేదు. లైట్ వెలిగించిన తరువాత దాన్ని తొలగిద్దామని.

ప్రమోద్ స్విచ్ ఆన్‌చేశాడు. లైటు మెరుపులా మెరిసి ఆరిపోయింది. అప్పటి వరకూ తిరుగుతున్న 'పంకా' తిరగడం ఆగిపోవడం గమనించిన ప్రమోద్ అన్నాడు...

"బుల్ షిట్... నేను స్విచ్ ఆన్‌చెయ్యగానే కరెంట్ పోవాలా?" తిట్టుకున్నాడు.

"డియర్! డోంట్ వేస్ట్ యువర్ బ్రైవ్‌" ప్రమోద్‌ని తనపైకి లాక్కుండూ అంది కొర్తిమాల. ప్రమోద్ ఆ రాత్రంతా ఎదురు చూసాడు. కరెంట్ ఎప్పుడు వస్తుందా! అని. కానీ ఆ రాత్రంతా కరెంట్ రాలేదు. తను కిటికీ తలుపుతీసి బయటికి చూసుంటే అతనికో విషయం బోధ పడేది.

★ ★ ★

"డియర్ స్వర్ణరేఖా!"

క్షేమమనుకుంటాను. ఉత్తరాలు రాయడం మానేసావేం? నేను రిప్లయి ఇస్తూనే ఉన్నాను కదా? ఆ రోజు మీ ఆయనని తీసుకుని మా ఇంటికి వస్తానని మాట తప్పావేం?

మీ 'లిటిల్ రాస్కేల్' అల్లరి చేస్తున్నాడా? మీ ఆయన్ని తీసుకుని, పిల్లాడితో, మా ఇంటికి వచ్చి ఓ వారం రోజులు మా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళమంటుంటే అంత మురిపించుకుంటావేం?

మా ఆయన కూడా ఈ విషయం గట్టిగా రాయమన్నారు.

నీకో సీక్రెట్...

మవ్వు నా పెళ్ళయిన కొత్తలో నా ఆడబడుచుగా కాకుండా, నా క్లాస్‌మేట్‌గా, నా మిత్రురాలిగా నాకో సలహా ఇచ్చావు గుర్తుందా?

ఒకందుకు మాత్రం ఒప్పుకోవద్దని, అలా అయితే మీ అన్నయ్య నా కొంగుపట్టుకునే తిరుగుతారని, ఆకర్షణ తగ్గదని అన్నావు గుర్తుందా?

అయితే ఈ మధ్య ఆయన ఆ విషయంలో పట్టుబట్టారు. బెడ్‌రూంలో లైట్ ఉంచి తీరాలన్నారు. ఒప్పుకోక తప్పలేదు. ఒప్పుకున్నాను. అయితే కొన్ని షరతులు పెట్టాను. ఆ ఒక్క రోజే నొప్పుకున్నాను. ఆ రోజు ఆయన స్విచ్ వెయ్యగానే కరెంట్ పోయింది. అలా నేనే ఏర్పాటు చేసాను. ఆయన స్విచ్ వెయ్యగానే కరెంట్ పోయేట్టు వైర్స్ కనెక్ట్ చేసాను.

ఆయన మాట కాదనలేదు. నా నియమమూ తప్పలేదు. నిజమేనే... గుప్తంగా ఉంటేనే ఆకర్షణ ఉంటుంది. ఇక ఉంటాను. జవాబు ఇయ్యి.

నీ కొర్తిమాల.

కొర్తిమాల, స్వర్ణరేఖకి రాసిన ఆ ఉత్తరం చదివిన ప్రమోద్ ఆశ్చర్యపోయాడు. మర్నాడు బెడ్ రూంలో లైటు ఆర్పేస్తూ అన్నాడు కొర్తిమాలతో.

"బహిర్గతం చేసుకుని, నీచంగా ప్రవర్తిస్తూ, ద్వంద్వార్థాల పదాలతో మాట్లాడుకుంటూ, ఇలాంటి విషయాల్లో ఆకర్షణ పోయేట్టు చేసుకుంటున్నాం. వద్దు... మనం అలా ప్రవర్తించొద్దు. నీ మీద నాకు... నా మీద నీకు ఎప్పటికీ ఆకర్షణ పోకూడదు... ఐ లైక్ యూ"

ఆ మాట విన్న కొర్తిమాల అతన్ని దగ్గరికి తీసుకుని మదిటిమీద ముద్దుపెట్టుకుంది.

●

